# 14. ప్లాట్‌ఫారమ్ నంబరు 15

"వేగంగా తినవయ్యా సింగుబాబూ! చల్లారితే బాగోదయ్యా"

చంద్రమ్మ ప్లేటులో ఇడ్లీలు పెట్టి, అవి మునిగినట్లు సాంబారు పోసి, ఆ కర్నేలుసింగు ముందుంచి అప్పుడే అయిదు నిమిషాలయింది. ఎదురుగుండా బెర్తుమీద కూర్చున్న చతుర్వేది అప్పుడే నాలుగిడ్లీలు, రెండు గారెలు లాగించాడు. ఇంకా కావాలని చంద్రమ్మను పిలుస్తున్నాడు.

సింగుబాబు చాల స్థిరంగా కూర్చొని ఉత్తరం వ్రాస్తున్నాడు. జలందరు నుండి ఒక స్నేహితుడు పదిరోజులకింద ఉత్తరం వ్రాశాడు. ఏరోజుకారోజు జవాబు వెనుకబడుతున్నది. ఈదినం విధిగా జవాబు వ్రాయాలని, తనకు వచ్చిన యింగ్లీషులో చమత్కరిస్తున్నాడు.

"బొంబాయి మహానగరం గురించి ఎంత చెప్పినా తరగదు. ఇక్కడి ఆడవాళ్ల గురించి అడిగావు. వందలకొద్దీ 'స్కిట్స్', (అంటే వయసులోని ఆడవాళ్లని సింగు అభిప్రాయం కాబోలు) ప్లాట్‌ఫారాలమీద, బజార్లలోను, ఆఫీసులలోను కనిపిస్తారు. రకరకాల చీరలు, బాడీలు, ఫంట్లాలు, గౌనులు- రంగు రంగుల చిలకలు - వాళ్లేమి వేసుకున్నా కత్తుల్లా ఉంటారు. అన్నీ టైటు బట్ట లేనయ్యా ..... "

ఆలోచిస్తూ కర్నేలు సింగు ముఖమెత్తి చూశాడు. ఎదుటి బెర్తుమీద చతుర్వేదికి మరో రెండు ఇడ్లీలు వేసి, సాంబారు పోస్తున్నది, చంద్రమ్మ. ఆమె పైట కొంచెం జారింది. తొడుక్కున్న తెల్లని రవికలో ఆరోగ్యవంతమైన వక్షం కనిపిస్తున్నది. సింగుబాబు దృష్టి మరల్చలేక అలాగే చూస్తున్నాడు.

చంద్రమ్మ నిలబడి సింగువేపు తిరిగింది.

సింగు ఉత్తరం పక్కకు పెట్టి, చంద్రమ్మను చూస్తున్నాడు.

నల్లగా నేరేడుపండు రంగులో చంద్రమ్మ శరీరం మెరుస్తున్నది. ఆమె కొప్పు పెట్టుకుంది. కొంచెం లేత రంగులో నున్న కుంకం,బొట్టుగా నుదుట దిద్దుకుంది. వయసామెది ముప్పై అయిదు దాటినా, కాయ శరీరం అవడం చేత ముప్పైకి లోపుగా కనిపిస్తుంది.

చంద్రమ్మ కూడా చాల తొందరపడుతున్నది. ఇవాళ పొద్దున్నే తొమ్మిది గంటలకు టూరిస్టు కోచి ఒకటి పదిహేనవ నంబరు ప్లాట్‌ఫారం మీద పెడుతున్నామని కారేజీ కళాసీ ఒకడు చెప్పాడు. అంటే మంచి బేరమన్న మాట. కోచి వచ్చిన వెంటనే దానిలోని వంట వాళ్లు

పని మొదలు పెడతారు. అయినా ఆకలి పాటు వాళ్లుంటారు. పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం మీద ఏది దొరికితే దాన్నే కొనుక్కొని తింటారు. అందుచేత ఏవీ దొరకని అక్కడ, చంద్రమ్మ తెచ్చిన యిడ్లీలకి, గారెలకి బాగా గిరాకీ. మరొక డబ్బా టీగాడు అప్పుడే అక్కడికి పోయి ఎదురు చూస్తున్నాడు.

"ఏటయ్యా! సింగుబాబూ! దెయ్యం పట్టినట్లు చూస్తున్నావ్?"

సింగు మాట్లాడలేదు. తెలుగు తెలిసి ఏడుస్తే కదా! మగవాళ్లకి ఆడవాళ్లకి ఒకే ఒక మూగబాస తెలుసు. కామం పెచ్చుపెరిగితే చూపులే మాట్లాడుతాయి ఆ భాష.

"తినరా, నా మొగుడా? బండి పెట్టేస్తారు."

చటుక్కున నాలిక కొరుక్కుంది. గెడ్డాలసింగుని మొగుడని సంబోధించినందుకు చాల నొచ్చుకుంది. పైట సరిగా కప్పుకుంది. ఏదో సరదాగా, స్వేచ్ఛగా, స్నేహంతో అన్న తొందరపాటు మాటలకి భయమెందుకని మనసు సమాధానపరచుకుంది.

"సింగుబాబూ! గరమ్ ఇడ్లీ! గరం సాంబారు! గారీ గరమ్ హై! టండాహోనేసే అచ్చా నై రహేగా!" అంది గౌరవంతో, ఆదరంతో, తనకు వచ్చిన హిందీలో.

సింగు కూడా దారిలో పడ్డాడు. ఇడ్లీ చాల మెత్తగా స్పాంజిలా ఉన్నాయి. సాంబారులో గారెలు అద్భుతంగా ఉన్నాయి. మరో రెండు యిడ్లీ, నాలుగు గారెలు, మరో కప్పు సాంబారులో ముంచుకొని తినేశాడు. తరువాత జుత్తు ముడి పెట్టుకొని, గెడ్డానికి కొంచెం సెంటు రాసుకొని, బట్టలు వేసుకొని, పాగా పెట్టుకొని, చతుర్వేదితో కలిసి, రెస్టు వాన్ దిగి, లోకల్ ట్రయిన్లు బయలు దేరే మొదటి ప్లాట్‌ఫారం వేపు నడిచాడు.

పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం మీదికి ట్రయిన్లు రావు. బొంబాయి, విక్టోరియా టెర్మినస్ స్టేషన్లో ఇదే ఆఖరి ప్లాట్‌ఫారం. లోకల్ ట్రయిన్లు, మెయిలు పాసింజరు ట్రెయిన్లు మిగిలిన పధ్నాలుగు ప్లాట్‌ఫారాల మీదికి వస్తూ పోతూ ఉంటాయి. దీని మీద టూరిస్టు బోగీలు, రైల్వే వాళ్ల ఉండడానికిచ్చే రెస్టువాన్‌లు ఉంచుతారు. ఈ ప్లాట్‌ఫారం మీదికి స్టేషనులోంచి రానక్కరలేదు. పార్సిలాఫీసు పక్కనుంచి రావచ్చు. టూరిస్టులు నగరం చూచి ఏరాత్రికో చేరుకుంటారు.

పొద్దున్నే ప్లాట్‌ఫారం తుడిచేవాళ్లు వస్తారు. కొందరు బోగీలకు నీళ్లు పడతారు. కొందరు బాటరీ ఛార్జింగ్ చేస్తారు. కొందరు బాత్‌రూములకింద తొట్టెలు పెట్టి వెళ్తారు. ఈవిధంగా పొద్దున్న మనుష్య సంచారముంటుంది, మధ్యాహ్నం తక్కువగాను, సాయంకాలం ఒక మాదిరిగను ఉంటుంది.

పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం మధ్యనున్న చిన్న రెస్టువాన్‌లో నలుగురు రైల్వే పనివాళ్లున్నారు. వాళ్లు చాల దూర ప్రదేశాల నుండి వచ్చారు. ఢిల్లీ నుంచి కర్నేలు సింగు, ఆగ్రానుండి చతుర్వేది, మొగల్ షరాయి నుండి మరో యిద్దరు వచ్చారు. వీళ్లు నలుగురూ

ఒకే పని మీద రావడం నుంచి, వాళ్లందరికీ ఒకే రెస్టు వాన్ లో బస యేర్పాటు చేశారు. అందులో నాలుగు బెర్తులున్న చిన్న గది, ఒక కూపే, స్నానాలకి వంటలకి యేర్పాటులు, అన్నీ ఉన్నాయి. కుర్లా బొంబాయిలో ఒక భాగం. అక్కడ అమోనియా, ఆక్సిజన్ మొదలైనవి నింపే టాంకు వాగన్లకు మరామ్మత్తు చేస్తారు. ఆ పని నేర్చుకోడానికి దేశంలో నలుమూలలనుంచి రైల్వే పనివాళ్లు వస్తారు.

కర్నేలు సింగు, చతుర్వేది నాలుగు బెర్తులున్న దాంట్లో ఉంటున్నారు. వాళ్ల ట్రెయిన్ ఎగ్జామినర్లు- వాళ్లిద్దరూ కాంటీన్లలోను, హెూటళ్లలోను అవకాశమున్న చోట తింటున్నారు. పొద్దున్న ఎనిమిది గంటలకు కుర్లాలో ఉండాలి. అందుచేత ఏడుగంటలకే సిద్ధమయి, టిఫిన్ కోసం ఎదురుచూస్తారు. వచ్చిన కొత్తలో బ్రెడ్, వెన్న తెచ్చుకునేవారు. చంద్రమ్మ ప్లాట్‌ఫారం మీద ఉదయం పూట ఇడ్లీ, గారెలు తెచ్చి అమ్ముతుంటే, ఒక రోజు వాటి రుచి చూసి, మర్నాటి నుంచి ఆమె దగ్గిర కొంటున్నారు.

పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం మీద ఇడ్లీ, గారెలు అమ్మే చంద్రమ్మ బొంబాయి వచ్చి ఎంతో కాలం కాలేదు. ఆరునెలలే అయింది. అసలు చంద్రమ్మది కాశీబుగ్గ దగ్గిర పల్లెటూరు. అక్కడ ఆమెకో చిన్న యిల్లుంది. చంద్రమ్మకు చిన్నతనంలోనే పెళ్లయింది. ఆ మొగుడు కలకత్తా దగ్గిరనున్న జనపనార మిల్లులో పనిచేస్తుండేవాడు. ఏదో సాకు చెప్పి చంద్రమ్మను కలకత్తా తీసుకెళ్లడం మానేశాడు. అప్పుడప్పుడు డబ్బు పంపించేవాడు. చాలకాలం నుంచి డబ్బు పంపడం మానేశాడు. చంద్రమ్మకు పాతికేళ్ల వయసయినప్పుడు, ఒక రోజు ఒక బెంగాలీ యువతిని, యిద్దరు పిల్లలను తీసుకొని పల్లెటూరు వచ్చాడు. అప్పుడు పెద్ద తగువయింది. బెంగాలీ అమ్మాయితో కలిసి కాపురం చేస్తే కలకత్తా రమ్మన్నాడా పెద్దమనిషి. ఇంతకాలం స్వేచ్ఛగా బతికిన చంద్రమ్మకు మరొకరితో కలిసి కాపురం చేయడానికి మనసయింది కాదు. ఆవిధంగా మనువు తెగిపోయింది, పదేళ్ల కింద.

చంద్రమ్మ తల్లి ఈ మధ్యనే పోయింది. అప్పుడు బొంబాయిలో ఉన్న చెల్లెలికి టెలిగ్రామిస్తే ఆమె వచ్చింది. ఆ చెల్లెలికి ముగ్గురు పిల్లలు. ఆమె మొగుడు బట్టల మిల్లులో పని చేస్తున్నాడు. కళ్యాణ్ స్టేషనుకు దగ్గిరలో చిన్న యింట్లో వాళ్లుంటున్నారు. దినవారాలయిన తరువాత అక్కను తనతో బొంబాయి తీసుకు పోయింది చంద్రమ్మ చెల్లెలు.

ఉండేది పల్లెటూరయినా, పట్నమంటే తెలియనిది కాదు చంద్రమ్మ. పెరట్లో నాలుగు మునగ చెట్లు, రెండు మామిడి చెట్లు, మూడు పనసచెట్లు ఉన్నాయి. పళాసా బజారుకి మునగకాడలు, మామిడిపళ్లు, పనసపళ్లు, గ్రామంలోని ఇతర స్త్రీలతో తీసుకెళ్లి అమ్ముకొని వచ్చేది. కాని, పళాసా ఎక్కడ, బొంబాయి ఎక్కడ?

చెల్లెలితో బొంబాయి వెళ్లేటప్పుడు, తనకు తన గ్రామానికి ఋణం తీరిపోయిందని అనుకుంది చంద్రమ్మ. ఇల్లు, పెరడు , పెరటిలోని చెట్లు అన్నీ అమ్మేసి శాశ్వతంగా బొంబాయిలో ఉండిపోదామనుకుంది. అప్పుడు వెంకునాయుడో సలహా యిచ్చాడు. ప్రయాణం

ఖర్చులకి ఒక అయిదువందల రూపాయలిచ్చాడు. ఆ యింట్లో తన ధాన్యపు బస్తాలు పెట్టుకొని, పెరటి చెట్లను చూసుకుంటూ, వాటిమీద వచ్చే ఆదాయం ఎప్పుడు అవసరమైతే అప్పుడు పంపుతానన్నాడు. ఉన్న యిల్లు అమ్ముకుంటే ఊరికీ తనకు సంబంధమే పోతుందని, ఒక వేళ మనసు మళ్లీ తిరిగి రావాలనుకున్నా అవదని చెప్పాడు. మంచో, చెడో వెంకునాయుడు చెప్పిందంటే చంద్రమ్మకు గురి. ఆ ప్రకారమే అతని దగ్గిర అయిదు వందలు తీసుకుని చెల్లెలితో బొంబాయి బయలు దేరింది చంద్రమ్మ.

చంద్రమ్మకు జ్ఞానోధయం కలగడానికి అట్టేకాలం పట్టలేదు. చెల్లెలు బొంబాయి నగరానికి కొన్ని మైళ్ల దూరంలో ఉన్నా, కుళ్లు కాలువకు మాత్రం పక్కనే ఉంది. ఆ కాలువ పక్కను ఒక గుడిసె, ఆ గుడిసెకు పై కప్పు కొంత వరకు టిన్ను రేకులు, కొంతవరకు చిరిగిన గోనెలు, వాటిపైన కాగితాలు, ప్లాస్టిక్ షీట్లు- ఈ విధంగా మాసికలతో తయారయి ఉంటుంది. పదడుగులు పొడుగు, ఎనిమిదడుగులు వెడల్పు ఉన్న గదిలో చెల్లెలు, పిల్లలు, తాను, అందరికన్న మిన్న అయిన తాగుబోతు యజమాని. ఆ పిల్లలు అల్లరి పిల్లలు- నీళ్లు పోసుకోడానికి మరుగులేదు, పైకి పోడానికి రోజూ అవస్థే. వీటన్నిటినీ ఆమె ఓర్చింది. ఒక రోజు తాగొచ్చిన యజమాని, చెల్లెలిని వదిలి, తనమీద పడితే సహించలేకపోయింది. ఇంటికి తిరిగి పోతానంటే చెల్లెలు కూడా అడ్డు చెప్పలేదు.

తెచ్చుకున్న రెండు చీరలు, వాటిలో చిన్న డబ్బీలో పదిలంగా దాచిన మూడు నూరు రూపాయల నోట్లు - వీటితో కళ్యాణ్ నుండి విక్టోరియా టెర్మినస్‌కి వచ్చింది, చంద్రమ్మ, ఒక ఆదివారం మధ్యాహ్నం.

చంద్రమ్మ చెల్లెలు అక్కకు బొంబాయి చూపిస్తూ ఒకసారి ఈ పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం వేపు నడుస్తుంటే, కుడివేపు చిన్న చిన్న యిళ్లున్నాయి. చిన్న మసీదు ఉంది. వాటిని దాటివెళ్తే పొన్నమ్మాళ్ దుకాణం ఉంది. అప్పుడామె దోసెలు పోస్తున్నది. పొన్నమ్మ తంజావూరు ప్రాంతం మనిషి - తెలుగు మాట్లాడుతుంది- అప్పుడామె పరిచయం చంద్రమ్మకు కలిగింది. తరువాత రెండు మూడుసార్లు చంద్రమ్మ అక్కడికెళ్లి టిఫిన్ తింది.

బొంబాయి వంటి మహానగరంలో దక్షిణాది నుంచి వచ్చిన వాళ్లు ఒకరినొకరు సులువుగా పోల్చుకోడమే కాకుండా ఒకరికొకరు సహాయపడడం పరిపాటి అయింది. పొన్నమ్మాళ్ చంద్రమ్మను చూడగనే పోల్చుకుంది. పోల్చుకోడమే కాకుండా చాల అభిమానంతో లోపలికి పిలిచి దోసెలు పెట్టింది. మంచీ చెడ్డా అడిగింది. రాత్రి తన దగ్గిరే ఉంచుకుంది. చంద్రమ్మ వంటి వాళ్ల కోసమే ఎదురు చూస్తున్నానంది.

పొన్నమ్మాళ్ వయసు ఏభై పైబడింది. ఆమెకు రెండు రోజులకింద టెలిగ్రామ్ ఒకటి వచ్చింది. ఆమె తల్లి చనిపోతూ తన ఆస్తిని ఇద్దరు కూతుళ్లకు వ్రాసి యిచ్చింది. ఆస్తి పంపకాలింకా కాలేదు, ఇంతలో అక్కకి కూడా జబ్బు చేసింది. ఆస్తి పాస్తులు పంచుకోవాలి. బొంబాయిలోని వ్యాపారం లాభసాటిగా ఉంది. దానిని విడవాలని లేదు. కాని వెళ్లక తప్పదు.

వ్యవహారాలు చూసుకొని వచ్చేదాకా ఎవరైనా దుకాణం నడిపిస్తే బాగుండునని ఆమె ఎదురు చూస్తున్నది. దేవుడు పంపించినట్లు చంద్రమ్మ వెతుక్కుంటూ వచ్చింది.

చంద్రమ్మ మరేవీ అడ్డు ప్రశ్నలు వెయ్యలేదు. తన దగ్గిర ఉన్న డబ్బులో రెండు వందలు పొన్నమ్మ కిచ్చింది. మిగిలిన దానితో వ్యాపారం మొదలు పెట్టింది.

చంద్రమ్మ చాల తెలివైనది. ఉదయం పూట కొంచెం తీరిక చేసుకొని పదిహేనవ నంబరు ప్లాట్‌ఫారం మీద ఇడ్లీ అమ్మడానికి వెళ్లేది. అక్కడ అందరికీ ఆమె పొన్నమ్మాళ్ కూతురు చంద్రమ్మాళ్ అని వినికిడి. టూరిస్టు బోగీలు వస్తాయని ముందే కబురు తెలిసేది. అటువంటప్పుడు అమ్మకం బాగా ఉండేది. సహజంగా బాగా శ్రమపడి, మంచి తినుబడి వస్తువులు తయారుచేయగల చంద్రమ్మ, మొదటి నెలలోనే, ఖర్చులు పోను మూడు వందల రూపాయల లాభం సంపాదించింది.

చంద్రమ్మకుండే చికాకులు ఆమెకూ ఉన్నాయి. ప్లాట్‌ఫారం మీద కాళీ అన్న కారేజి ఫిట్టరు తిన్నంత తిని డబ్బివ్వడు. పై పెచ్చు తాగి తందనాలాడతాడు. ఒకసారి నలుగురిలో తన భుజంమీద చెయ్యివేస్తే పడరాని తిట్లు తిట్టి తన్నినంత పని చేసింది. ఈ తతంగమంతా కర్నేలుసింగు, చతుర్వేది చూశారు. అది కూడా ఒకందుకు మంచికే వచ్చింది. లేకపోతే ఆమె పాట్లు చెప్పరానివయేవి.

రెండు నెలలయే సరికి చంద్రమ్మ పదిహేనోనంబరు ప్లాట్‌ఫారానికి పాతదయింది. పొద్దున్న మాత్రమే ప్లాట్‌ఫారంవేపు వెళ్లి ఇడ్లీ, గారెలు అమ్మేది. మధ్యాహ్నం మూడయిన దగ్గిర నుంచీ, ఇంటి వరాండాలో పొయ్యి పెట్టి, మిరపకాయ బజ్జీలు, ఉల్లి పకోడీలు చేసి అమ్మేది. సాయంకాలం ఆరుగంటల తరువాత ఇంటినుండి బయటికి వచ్చేదికాదు.

కుర్లాలో పనిచేయడానికి వచ్చిన కుర్రకారు పగలల్లా ఎండలో మాడి, సాయంకాలం కాగానే ఏదో ఒక బీచికి పోతుండేవాళ్లు. మొగల్‌షరాయి మెకానిక్కులకు రెండు నెలలు ట్రెయినింగు అయిపోగానే వెళ్లిపోయారు.

ఒకరోజు ఉదయం, వాడుక ప్రకారం చంద్రమ్మ ఇడ్లీ పట్టుకెళ్లింది రెస్టు వాన్‌కి. ఇద్దరికీ రెండు ప్లేట్లలో పెట్టిన తరువాత ఆమెకు తెలిసింది, కర్నేలు సింగు ముఖమెవరో పచ్చడి చేశారని. చతుర్వేదిని ఆమె కారణమడిగింది.

"ఈనాడు ఆడిపిల్లలందరూ కరాటే నేర్చుకుంటున్నారు పాపం! మన సర్దార్జీ, వాళ్లందరూ పువ్వులవంటి అబలలేనని అనుకొని, ఆఘ్రాణించబోతే, ముఖం పచ్చడయింది." అన్నాడతను నవ్వుతూ.

చంద్రమ్మ మాత్రం నవ్వలేదు. వెంటనే యింటికి పోయి ఒక గిన్నెతో నీళ్లు మరిగించి తెచ్చింది. వాటితో సింగు ముఖం కాచుకొని అటు తరువాత టిఫిన్ చేశాడు. ఆ విధంగా ఆమె వాళ్లకు ఇంకా చేరువయింది.

ఒకొక్కప్పుడు వాళ్లకు డబ్బులు రాకపోతే అరువిచ్చేది. ఒకసారి వాళ్లకు రాత్రిభోజనాలు లేకపోతే వండి యిచ్చింది. వాళ్లుకూడా, మనసులో ఏమున్నా, పైకిమాత్రం చంద్రమ్మతో మర్యాదగా మెలుగుతుండేవాళ్లు.

ఎండలు బాగా ముదిరాయి. ఉన్నట్లుండి, పొన్నమ్మాళ్ దేశంలో పోయిందని, రెండు వందల రూపాయలు పంపమని చుట్టమెవడో టెలిగ్రామిచ్చాడు. ఆరోజు సాయంకాలమే చతుర్వేది చేత మనియార్డరు ఫారం నింపించి, మరునాడే పెద్ద పోస్టాఫీసులో రెండు వందల రూపాయలు కట్టింది చంద్రమ్మ. ఈ మార్పుతో, పొన్నమ్మాళ్ వ్యాపారానికి చంద్రమ్మ శాశ్వతంగా వారసురాలయింది.

ఇల్లమ్మి డబ్బు పంపించమని, తిరిగి గ్రామం వెళ్లే ప్రసక్తి లేదని వెంకునాయుడికి ఉత్తరం వ్రాయించాలని అనుకుంది. కాని అతని మాటలు జ్ఞాపకం వచ్చి, ఆ పని వాయిదా వేసింది. ప్రస్తుతానికి తనకు డబ్బు అవసరంలేదు.

చంద్రమ్మ ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతుంది. స్వచ్ఛమైన తెల్లటి బట్టలే కట్టుకుంటుంది. నల్లటి మనిషి ఏమో, ఆ బట్టలలో ఆమె చక్కగా కనిపించేది. లేతరంగు కుంకుమబొట్టు ఆమె అందానికి మెరుగులు పెట్టేది.

చంద్రమ్మను చూస్తుంటే కర్నేలు సింగుకి మతి పోతుండేది. ఆమె కించిత్తయినా మనసు బయట పెట్టకుండా, ఏవిధమైన అవకాశం ఇవ్వకపోడం నుంచి, అతను చాల జాగ్రత్తగా ఉండేవాడు. ప్లాట్‌ఫారం మీది పనివాళ్లంతా ఆమెకు అనుకూలంగా ఉండడం చేత, ఏ చొరవా తీసుకోలేకపోయాడు.

కర్నేలుసింగు మిత్రుడు జలందర్ నుండి ఉత్తరాలు వ్రాస్తునే ఉన్నాడు. అందగత్తెల గురించి అడుగుతునే ఉన్నాడు. కాని, సింగు మాత్రం ఎటువంటి అనుభవాల గురించి తెలియజేయలేకపోయాడు. జుహూ బీచిలో, ముగ్గురే ఆడవాళ్లని వెంటబడితే, ముఖం పచ్చడి చేశారని, ఏముఖం పెట్టుకొని వ్రాయగలడు?

జూన్‌నెల వచ్చింది. ఆకాశంలో అప్పుడప్పుడు తొంగి చూసిన మబ్బులు క్రమంగా ముసురుకొని వర్షాలు మొదలయాయి. వాటితో కాలిపోయిన భూమి ఆవిరులను కక్కుతున్నది. భరించరాని ఉడకపోత సాయంకాలానికి తప్పనిదయింది.

వర్షాలు జోరయిన తరువాత కర్నేలుసింగు, చతుర్వేది సాయంకాలం పూట ఎక్కడికీ వెళ్లడం మానేశారు. చంద్రమ్మకి డబ్బిచ్చి రాత్రిభోజనం తయారు చేయించుకునే వాళ్లు.

పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం మీదికి, ఉన్నట్లుండి, ఒకనాటి ఉదయానికి మూడు టూరిస్టు బోగీలు వచ్చాయి. చిలిపి చిలిపి జల్లులు క్రమంగా ధారాపాతంగా కురిసే వర్షాలుగా మారాయి. చంద్రమ్మకు చాల పని కలిగింది. అలాగే తడుసుకుంటూ పొద్దున్న పూట అమ్మకం సాగించేది.

పొద్దున్నే టూరిస్టులకోసం ఇడ్లీ పట్టుకెళుతున్న చంద్రమ్మను ఆపి, చతుర్వేది చెప్పాడు, మరో రెండు రోజుల్లో వెళ్లిపోతున్నామని, కాబట్టి ఈ రెండు రోజులు, చంద్రమ్మ వారికి భోజన ఫలహారాలు సప్లయి చేయవలసి వచ్చింది. వెళ్లిపోతున్నారేమో, కాదనలేకపోయింది.

చంద్రమ్మ అమ్మకానికి ప్లాట్‌ఫారం మీదికి వెళ్తున్నదేకాని, ఎవరో బలవంతాన పంపితే వెళ్లినట్లుంది. ప్లాట్‌ఫారం మీద అడుగు పెట్టడమంటే ఆమెకు అసహ్యంగా ఉంది. మూడు రోజులై కారేజి స్వీపర్లు సమ్మె చేస్తున్నారు. సాధారణంగా, వర్షాకాలంలో టూరిస్టు ట్రాఫిక్ అంతగా ఉండదు. కాని, ఈ సారి మూడు బోగీలు వచ్చి పడ్డాయి. ఒకొక్క దానికి డెబ్బై మంది చొప్పున ఉంటున్నారు. మరుగు దొడ్ల కింద పెట్టిన తొట్టెలు ఎవరూ తీయడం లేదు. కాలువలు తుడవడం లేదు. ఎంత పరిశుభ్రమైన గ్రామ వాతావరణంలో చంద్రమ్మ బతికిందో, ఇక్కడ అంత అపరిశుభ్రమైన పరిసరాలలో అమ్మకం సాగించవలసి వస్తున్నది. కాని, ఏం చేస్తుంది, తలదూర్చిన తరువాత.

ఆవేళ ఆదివారం. ఆ ఉదయం చంద్రమ్మ రెస్టువాన్‌లో టిఫిన్ యిస్తున్నది. కర్నేలు సింగు బట్టలు సర్దుకుంటున్నాడు. చతుర్వేది పెట్టి తీసి డబ్బులు లెక్కబెడుతున్నాడు.

"చంద్రమ్మా! కూర్చో!" అన్నాడు చతుర్వేది హిందీలో

"లేదు. పనుంది. తొందరగా పోవాలి" ఆ భాషలోనే జవాబిచ్చింది చంద్రమ్మ.

"ఇదిగో, నీకియ్యవలసిన డబ్బు. మధ్యాహ్నం భోజనం వరకు యిచ్చివేసినట్లే. ఇవాళ మేము దాదర్-డూన్ ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళిపోతున్నాము. ఆ బండి ఎన్నిగంటలకో తెలుసా? రాత్రి పది గంటల నలభై నిమిషాలకి దాదర్ నుండి బయలు దేరుతుంది. మేము కనీసం తొమ్మిదిన్నరకేనా విక్టోరియా టెర్మినస్ విడిచిపెట్టాలి. బోధపడిందా?"

"బోధ పడింది."

"ఈ రోజు ఆఖరిరోజు, రాత్రి కొంచెం మంచి భోజనం చేయాలని అనుకుంటున్నాం. మిఠాయి, పళ్లు, రెండు కూరలు, సాంబారు, చట్నీ, మామూలుగా చేసే రొట్టెలు, కొంచెం పలావు, ఇవన్నీ నువ్వే ఏర్పాటు చేయాలి. ఇవిగో పాతిక రూపాయలు."

"అమ్మో! నేనిన్ని చేయ్యలేను."

"నీ ధర్మమా అని యింటి భోజనం చేస్తున్నట్లు సంతోషిస్తున్నాము. ఆఖరి రోజున చేయనంటే ఎలా?"

"చతుర్వేది బాబు అలాగే అంటాడు."

"సింగుబాబు కూడా అలాగే అంటున్నాడు. ఇంకా మరో సంగతి, నువ్వీరాత్రి మాతోనే భోజనం చేయాలి. చతుర్వేదీ! మరో పదిరూపాయలియ్యి!" అన్నాడు కర్నేలు సింగు.

"బాబులూ! మీ పుణ్యముంటుంది. నేనీ కంపులో తినలేను."

"తలుపులన్నీ వేసి, ఊదొత్తులు వెలిగిస్తాం" అన్నాడు చతుర్వేది.

'మాయింటికి రండి' అని అందామని అనుకుంది. కాని, అది రేకులషెడ్డు. అంతటా కారుతున్నది. అన్నీ వండి, పెట్టడానికే చోటు చాలదు.

"మీతో కలిసి భోజనం మాత్రం చెయ్యలేను. మీరు తిని సంతోషిస్తే, అదే చాలు పదివేలు."

"చంద్రమ్మా! మరొక్క మాట. ఎనిమిదో గంటకి అన్నీ ఇక్కడుండాలి." అన్నాడు చతుర్వేది.

చంద్రమ్మ తలూపింది.

వర్షం ఉండుండి పడుతున్నది. తెరిపి యివ్వగనే బజారుకి పోయి, పళ్లు, మిఠాయి, కూరలు, పెరుగు కొనుక్కొని వచ్చింది. మధ్యాహ్నం మూడు నుంచే వంట మొదలు పెట్టి, ఒకటీ ఒకటి పూర్తి చేసి, గిన్నెలలోకి, ప్లేట్లలోకి తీసి, మూతలు పెట్టింది. సాయంకాలం ఆరున్నరకి అన్నీ పూర్తి చేసి, ఒళ్లు కడుక్కొని, తెల్లని మడత చీర కట్టుకుంది. జుత్తు దువ్వుకొని ముడి చుట్టుకుంది. లేతరంగుకుంకం బొట్టు పెట్టుకుంది. అన్నీ ఒక్కసారి తీసుకొని పోడం ఎలాగూ అయే పనికాదు. అందుకోసం రెండు తడవలలో తీసుకొనిపోడానికి నిశ్చయించింది.

బాగా చీకటి పడింది. ఆకాశం మేఘావృతమై ఉంది. వర్షం కురిసి తెరిపిచ్చింది. వర్షం మళ్లా మొదలవకుండా, వండిన పదార్థాలలో కొన్నింటిని పట్టుకొని పదిహేనో నంబరు ప్లాట్‌ఫారం మీద అడుగుపెట్టింది. భరించరాని దుర్గంధం ఆమెకు స్వాగతమిచ్చింది. చీరచెరగుతో ముక్కుమూసుకోడానికి కూడా వీలయింది కాదు; రెండు చేతులలోను ప్లేట్లు, గిన్నెలు ఉన్నాయి. మనుషుల సంచారం కూడా అంతగా లేదు.

రెస్టువాన్ తలుపు తెరిచే ఉంది. లోపలలైట్లు వెలుగుతున్నాయి. చతుర్వేది చెప్పిన ప్రకారమే లోపల తలుపులన్నీ వేసి ఊదొత్తులు వెలిగించి ఉన్నాయి. పైనున్న బెర్తుల మీద సర్దిన సామానుంది. కింది బెర్తులలో ఒకదాని మీద సింగుబాబు, చతుర్వేది కూర్చున్నారు. ఎదురుగా నున్నది కాళీగా ఉంటే, దానిమీద తెచ్చిన గిన్నెలు, ప్లేట్లు ఉంచింది చంద్రమ్మ. తలుపు వెయ్యవద్దని చెప్పి, మిగిలిన వస్తువులు తీసుకొని రాడానికి వెళ్లింది.

రెండవసారి చంద్రమ్మ ప్లాట్‌ఫారం మీదకు వచ్చేసరికి ఎదురుగాలి వీస్తున్నది. వర్షం కూడా మొదలయింది. ఉరుములు, మెరుములు- జోరుగా వీచినగాలికి చంద్రమ్మపైట ఎగిరి పోయింది.

ఆమె రెండోసారి లోపలికి రాగానే చతుర్వేది వాన్ తలుపు మూసి గడియపెట్టాడు.

చంద్రమ్మ రెండు చేతులలో ఉన్న సామాను బెర్తుమీదపెట్టి, తరువాత పైట సరిచేసుకుంది,

కర్నేలుసింగు కళ్లప్పగించి చంద్రమ్మను చూస్తున్నాడు. అతని చేతిలో నున్న గ్లాసులో బంగారు రంగు ద్రావకముంది. చతుర్వేది కూడా తన గ్లాసులోకి ఒక వేలెడు ద్రవం పోసుకొని, నీళ్లు కలుపుకున్నాడు.

"కూచో చంద్రమ్మా!" చతుర్వేది అన్నాడు, తన పక్కను చోటు చూపిస్తూ.

"నేను కూర్చోడానికి రాలేదు. తొందరగా మీకు పెట్టి వెళ్లిపోతాను."

"చంద్రమ్మా! ప్రయాణం చెయ్యవలసిన మాకు తొందరలేదు. ఇక్కడ ఉండవలసిన దానివి, నీకెందుకు?" అన్నాడు సింగు.

"ఏమో, బాబు! ఈ కంపులో నేనుండలేను. పైపెచ్చు ఈవర్షమొకటి."

"లోపల కంపూలేదు, వర్షమూ లేదు. గొంతుకులలోకి చల్లటి ద్రవం జారుతున్నది. వెచ్చదనమిచ్చే నువ్వున్నావు. తొందరెందుకూ? కూచో, చంద్రమ్మా!" అన్నాడు చతుర్వేది.

చంద్రమ్మకేమి అర్థమయిందో, జవాబు చెప్పలేదు, కూచోను లేదు.

"చతుర్వేది! అప్పుడే ఎనిమిదిన్నర అవుతున్నది. ముందుగా భోజనం చేస్తే బాగుంటుందేమో! ఇంతకంటే హెచ్చు తీసుకుంటే మజా పోతుంది." అన్నాడు సింగు.

వాళ్లు ప్లేట్లు తీసుకున్నారు. చేసి తెచ్చినవి, కొన్నవీ, అన్నీ వడ్డించింది చంద్రమ్మ.

బైట వర్షం ఇంకా హెచ్చయింది. మెరుములు, ఉరుములు.

లోపల వెచ్చగా ఉంది.

భోజనాలయి పోయాయి. ఆఖరున అరటిపళ్లు వొలిచి ముందు చతుర్వేది ప్లేటులో వేసి, సింగు ప్లేటులో వేయడానికి వంగింది చంద్రమ్మ.

ఉన్నపాటున సింగు ఆమె పైట లాగి, ఆమెను ఒడిసి పట్టుకున్నాడు.

చతుర్వేది కాళ్లు పట్టుకున్నాడు.

చంద్రమ్మ గట్టిగా అరిచింది.

పైన పెద్ద పిడుగు, దగ్గిరలోనే పడింది.

బెర్తు మీదికి చంద్రమ్మను లాక్కొని, కర్నేలు సింగు ఆమె మూతి మూశాడు, అరవకుండా. చతుర్వేది ఆమె తొడలను బలంగా పట్టుకొని నొక్కి ఉంచాడు.

బలం కూడ దీసుకొని, చంద్రమ్మ చతుర్వేదిని తన్నాలని ప్రయత్నించింది.

కర్నేలు సింగు బలంగా బెర్తుపక్కనున్న ఆరమ్‌రెస్టుకి వేసి ఆమె తలను మోదాడు.

చంద్రమ్మకు కళ్లు పచ్చబారిపోయాయి. తెలివి తప్పింది.

చంద్రమ్మకు తెలివి వచ్చేసరికి మీదనుంచి దీపపు వెల్తురు సూటిగా ముఖం మీద

పడుతున్నది. పైన కుంభవృష్టి కురుస్తున్నది. రేకుల మీద పడుతున్న వానచప్పుడు, కిందకు కాలువలుగా పడుతున్న నీటి చప్పుడు వినిపిస్తున్నవి. టూరిస్టుల బోగీలు వెళ్లిపోయాయి. రెస్టు వేన్ కూడా తీసివేసినట్లున్నారు.

కాని, ఎవరూ తీయనివి రెండు వందలమంది, మూడు రోజులై, ముక్కులు మూసుకుంటూ నింపిన తొట్టెలు. సమ్మె అయిపోతే అవన్నీ బాగు పడతాయి. కాని, పెద్ద వారికి చిన్నవారికి పేచీలు తెగినట్లు లేవు. అందుచేత దుర్గంధం విజృంభిస్తున్నది.

స్వీపర్లు తుడవకపోడంచేత కాలువలన్నీ మూసుకుపోయాయి. వర్షం ఎప్పటినుంచి కురుస్తున్నదో! ఆ నీరు క్రమక్రమంగా రైలు పట్టీల మీదికి పొంగుతున్నది.

చంద్రమ్మకు ఇంకా తెలివి వచ్చింది. కాళ్ళు చేతులు కదిలించాలని ప్రయత్నించింది. వాటికి వేయి మణుగుల బరువులు కట్టినట్లున్నాయి. స్పర్శజ్ఞానం క్రమ క్రమంగా కలుగుతున్నది. ఆమె శరీరాన్ని చల్లటి నీరు ఆక్రమిస్తున్నది. శరీరంలోని భాగాలు ఆనీటిలో మునుగు తున్నవి. వాటి మీద ఏవో తేలుతూ తన శరీరంమీదికి వచ్చి అంటుకుంటుంటే చంద్రమ్మ మరి భరించలేక పోయింది. మహా ప్రయత్నం చేసి లేచి కూర్చుంది. పైన రవిక మాత్రముంది. కూర్చోగానే శరీరం మీద కప్పిన చీర మాత్రం కిందకు జారింది.

అపుడామెకు నిజం గోచరించింది. చీరనిండా అడుసు. ఆ చీరను చుట్టుకోకపోతే శరీరమంతా బయటపడుతుంది. ఆ అడుసు, ఆ నీరు పొంగి మీదకు వస్తున్నవి. చంద్రమ్మ మరి భరించలేక పోయింది. చచ్చిపోతే నలుగురు ఎత్తి తీసుకుపోడానికైనా ఒళ్లు శుభ్రంగా ఉండాలి. ఈ అడుసులో మునిగిపోతే ఎవరూ తనకు సంస్కారం కూడా చెయ్యరు.

బలమంతా కూడగట్టుకొని చంద్రమ్మ లేచింది. ఆ చీరే చుట్టబెట్టుకొని మెల్లిగా రైలు పట్టీలు దాటి ప్లాట్‌ఫారం మీద నిలబడింది. అర్థరాత్రి దాటిపోయింది కాబోలు. మనుష్య సంచారం లేదు. మెల్లిగా యింటివేపు నడిచింది. ప్లాట్‌ఫారం దాటింది. వర్షం మరీ జోరయింది.

చంద్రమ్మ! ఆ వర్షంలో, తన యింటిముందు పావుగంట నిలబడింది. చీరకంటుకున్నది, శరీరానికంటుకున్నది పోయిన తరువాత యింట్లోకి వెళ్లింది. చీర విప్పి పెరటి వసారాలో ఒక మూలకు పారేసింది. రవిక తీస్తుంటే, దానికి పిన్నుతో గుచ్చిన రెండు అయిదు రూపాయల నోట్లు, తడిసి ముద్దయి, కనిపించాయి. చంద్రమ్మ చిన్నగా నవ్వుకొంది. రవికతో పాటు నోట్లను కూడా పారేసింది. తరువాత శరీరాన్ని , తలను బట్టల సబ్బుతో రుద్దుకుంది. వాసన సబ్బుతో కడిగింది. శరీరాన్ని పదిసార్లు తోముకుంది. ఇంకా ఆమె నాసాపుటాలలో అదేదో దుర్గంధం.

చంద్రమ్మ మడత చీర కట్టుకుంది. మరో రవిక తొడుక్కుంది. మంచం మీద కూర్చొని దుప్పటి కప్పుకుంది. శరీరమంతా నొప్పులుగా ఉంది.

బొంబాయి వ్యాపారం లాభాలకు సాటిలేనిది.

అక్కడక్కడ దాచిన డబ్బు చూసుకుంటే ఎనిమిది వందల రూపాయలు పైచిలుకు కనిపించింది. కాని, యిక్కడ బతకాలంటే, అప్పుడప్పుడు అడుసులో కాలు వేయడమే కాదు, పూర్తిగా మునిగిపోవలసి ఉంటుంది.

నా అన్నవాళ్లు ఎవరూ లేకుండా, తాను కోరిన నైర్మల్యం హృదయంలోను, బైటకూడా కరువై బతకాలి.

తన వూరు ఎంతమంచిది!

తన వెంకునాయుడెంత ఉదారుడు! అతని తొలిభార్య తన యీడుదే. ఆమెకు పిల్లలు లేరు. బహుశా తనను మనువాడితే అతనికి పిల్లలు పుడతారేమో!

తరువాత చాలసేపు చతుర్వేది గురించి, కర్నేలు సింగు గురించి ఆలోచించింది. వారిమీద తనకెప్పుడూ అనుమానం లేదు. మగవాళ్లను పూర్తిగా నమ్మకూడదు. ఇంతకూ వాళ్లిద్దరినీ అని ప్రయోజనమేమిటి? అది, వాళ్ల వయసు చేసిన తప్పు. తనవలెనే వాళ్లూ మనుష్యులే. వాళ్ల మీద తనకేమీ ద్వేషం లేదు. తాను వాళ్లకన్న పెద్దది. వాళ్లు చేసిన తప్పును మన్నించాలి.

ఈ పదిహేనో నంబరు ప్లాట్‌ఫారంకి వచ్చిన వాళ్లు వచ్చినట్లే వెళ్లి పోతున్నారు. ఎవరూ తన వలె శాశ్వతంగా ఉండాలని అనుకోడంలేదు. వాళ్లవలెనే తాను కూడా టూరిస్టే. తానూ వెళ్ళిపోవాలి.

కోళ్లు కూస్తుంటే చంద్రమ్మ టిక్కట్ల క్యూ వేపు నడిచింది, పళాసాకు కోణార్కలో టిక్కట్టు కొనుక్కోడానికి.